సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
శనివారం । 16 । ఆగస్టు । 2025



మహిళలకు ఉచిత బస్సు ఉపయోగకరం

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు ఉపయోగకరమని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్ తెలిపారు. -8లో



మద్యం అమ్మకాలు ప్రోత్సహించడం దుర్మార్గం

ప్రభుత్వమే మద్యం అమ్మకాలను ప్రోత్సహించడం దుర్మార్గమైన చర్య అని మహిళా సంఘాల ఐక్యవేదిక సభ్యులు తెలిపారు. -8లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
33.0/23.6

జిల్లాలో శుక్రవారం 23.6 - 33.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

మహనీయుల స్ఫూర్తి.. అభివృద్ధి దీప్తి



జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేస్తున్న మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్, కలెక్టర్, ఎస్పీ



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్



పోలీసు పరేడ్ మైదానంలో సాంస్కృతిక కార్యక్రమం ప్రదర్శిస్తున్న విద్యార్థులు

- స్టీల్ ప్లాంట్ మొదటి దశ పనులు ప్రారంభం
- రూ.2 వేల కోట్లతో నియో ఎనర్జీ ఏర్పాటు
- స్టార్టప్ స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా యువతకు ఉపాధి
- గండికోట ప్రగతికి మాస్టర్ ప్లాన్
- స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్

కడప సెవెన్‌రోడ్స్: ఎందరో మహనీయుల త్యాగ ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్య్రమని, వారు ఇచ్చిన స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం జిల్లా అభివృద్ధికి చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి నశ్యం మహమ్మద్ ఫరూఖ్ అన్నారు. స్థానిక పోలీసు పరేడ్ మైదానంలో శుక్రవారం నిర్వహించిన 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉదయం 9 గంటలకు జాతీయ జెండాను ఎగురవేసి పరేడ్ తిలకించారు. దళాల మార్చ్ ఫాస్ట్ తిలకించి జనరల్ సెల్యూట్ స్వీకరించారు. అనంతరం జిల్లా ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడారు. రాయలసీమ స్టీల్ ప్లాంటు మొదటి దశ 2028 డిసెంబరు నాటికి పూర్తి చేసి 2029 నుంచి ఉత్పత్తి చేపట్టే విధంగా పనులు వేగవంతం చేశామన్నారు. జమ్మలమడుగు మండలం సున్నపురాళ్ల వద్ద జేఎస్‌డబ్ల్యూ అనుబంధ సంస్థ నియో ఎనర్జీ ఏర్పాటు కానుందని, దీని ద్వారా 400 మెగా వాట్ల విద్యుత్ ఉత్పాదనతోపాటు 1380 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయని వెల్లడించారు. ఈ పరిశ్రమకు కావాల్సిన 2200 ఎకరాల భూమి కేటాయింపుతో రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు ఆమోదం లభించిందని పేర్కొన్నారు. కడపలో రూ.10 కోట్ల వ్యయంతో స్టార్టప్ స్కిల్ డెవలప్‌మెంట్ భవన నిర్మాణ సముదాయం ఏర్పాటు కానుందని, దీని ద్వారా సుమారు 15 వేల మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నామని తెలిపారు. గండికోట పర్యాటక అభివృద్ధి కోసం ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ రూపొందించిందన్నారు. గండికోట ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు సాస్కి ప్రాజెక్టు కింద రూ.78 కోట్ల వ్యయంతో ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేశారన్నారు. డిసెంబరు 26, 27 తేదీల్లో గండికోట ఉత్సవాలు నిర్వహించనున్నామని తెలిపారు. స్వదేశ్ దర్శన్ 2.0 కింద గండికోటను అభివృద్ధి చేస్తున్నామని, విదేశీ పర్యాటకులను సైతం ఆకర్షించేలా చర్యలు చేపడుతున్నామన్నారు.

ఆయకట్టుకు సాగునీరు



ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉన్నప్పటికీ కృష్ణా వరద జలాలను గండికోట రిజర్వాయర్‌కు తీసుకొచ్చి, అక్కడి నుంచి లిఫ్ట్ పద్ధతిలో పైడిపాలెం, చిత్రావతి రిజర్వాయర్లకు నీటిని తరలించి నిల్వ చేస్తున్నామన్నారు. యురేనియం ప్రభావిత గ్రామాల పరిధిలో 10 వేల ఎకరాల కొత్త ఆయకట్టును స్థిరీకరిస్తున్నామన్నారు. చిత్రావతి కుడి కాలువ ద్వారా 15 వేల ఎకరాల ఆయకట్టును అభివృద్ధి చేస్తున్నామని, ఎర్రబల్లె ఎత్తిపోతల పథకం పనులు చేపట్టామని వివరించారు. తెలుగుగంగ పరిధిలోని మూడు రిజర్వాయర్ల ద్వారా 2025–26 ఖరీఫ్ పంట కాలానికి 84,830 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తామన్నారు. అన్నదాత సుఖీభవ కింద ఒక్కో రైతుకు రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. పీఎం కిసాన్ కింద రూ.2 వేలతో కలిపి రూ. 132.93 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని పేర్కొన్నారు.

మహిళల ఉచిత ప్రయాణానికి 462 బస్సులు

చేనేత కార్మికులకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా జిల్లాలో 252 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తున్నామన్నారు. తల్లికి వందనం కింద తల్లుల ఖాతాల్లో రూ.354.12 కోట్లు జమ చేశామన్నారు. మహిళల ఉచిత ప్రయాణం కోసం జిల్లాలో 462 బస్సులు కేటాయించామని తెలిపారు. హుబ్లీ–కృష్ణపట్నం ఎకనమిక్ కారిడార్‌లో భాగంగా 627 కిలోమీటర్ల ఫోర్‌లేన్ రహదారి పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. మైదుకూరు నుంచి బద్వేలు వరకు భారత్ మాలా పర్యోజన పథకం కింద రూ.1063 కోట్లతో 45 కిలోమీటర్ల మేర రహదారి పనులు పూర్తి కావస్తున్నాయన్నారు.

పరిశ్రమల ఏర్పాటు

కొప్పర్తి మెగా ఇండస్ట్రియల్ పార్కులోని ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌లో పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయన్నారు. ప్రతిష్టాత్మక కంపెనీలు జిల్లాకు రానున్నాయని, వీటిద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 1.76 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద జిల్లాలో 876 గృహాలకు 3227 కిలోవాట్ల సోలార్ పవర్ సిస్టమ్స్ ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో రూ. 54,026 కోట్ల పెట్టుబడితో 11,276 మెగా వాట్లా సౌర, పవన, పంప్ స్టోరేజీ హైడ్రా పవర్ ప్రాజెక్టులు, ఆరు ప్రదేశాల్లో కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. వీటి కోసం 15,763 ఎకరాల ప్రభుత్వ భూములు, 2500 ఎకరాల అటవీ భూములను గుర్తించి కేటాయించే ప్రక్రియ ప్రారంభించామన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టామన్నారు. సబ్సిడీతో సూక్ష్మ సేద్య పరికరాలను అందిస్తున్నామని తెలిపారు. జిల్లాలో 4136 కొత్త వితంతు పెన్షన్లు మంజూరు చేసి పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ ఏడాది ఆర్థిక ప్రణాళికలో భాగంగా రూ. 3.50 కోట్లతో ఒక జిల్లా రహదారి, రూ.17.34 కోట్లతో మూడు రాష్ట్ర రహదారులు టెండరు దశలో ఉన్నాయన్నారు. విద్యార్థులకు కిట్స్ పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు అందిస్తున్నామన్నారు. ఈ ఏడాది హజ్ యాత్రకు వెళ్లే వారికి రూ.లక్ష ఆర్థికసాయం అందించనున్నామని వెల్లడించారు. ప్రధానమంత్రి ఆవాజ్ యోజన కింద సొంత స్థలాలు, లే అవుట్లలో గృహ నిర్మాణానికి ఆర్థికసాయం అందిస్తున్నామన్నారు. ఈనెల 25 నుంచి 31వ తేదీ వరకు జిల్లాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టనుందన్నారు.

పేదరిక నిర్మూలనకు చర్యలు

జిల్లా వృద్ధి రేటును ఐదేళ్లలో 15 శాతం సాధించడం, పీ4 బంగారు కుటుంబాలలో ఆర్థిక స్వావలంబన, పేదరిక నిర్మూలన లక్ష్యాలను సాధించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 74,276 బంగారు కుటుంబాలను, 5113 మంది మార్గదర్శిలను గుర్తించామని, ఇందులో 66,567 కుటుంబాలను దత్తత తీసుకోవడం ద్వారా రాష్ట్రంలో జిల్లా నాల్గవ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. జమ్మలమడుగు, సీకే దిన్నె మండలాల్లో నాలుగు స్మార్ట్ కిచెన్ పనులు చేపట్టామన్నారు. పాస్‌పోర్టుల జారీలో రాష్ట్రంలో జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు. డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు చర్యలు చేపట్టామన్నారు.

అబ్బుర పరిచిన అగ్నిమాపక ప్రదర్శన

అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు వాటి నుంచి రక్షించుకోవడానికి, అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించేలా ఏపీ డిజిస్టార్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీసెస్ నిర్వహించిన ప్రదర్శనలు అబ్బుర పరిచాయి. ఈ సందర్భంగా పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను మంత్రి పరిశీలించారు. అలాగే 9958 యూనిట్లకు సంబంధించి 76391 మంది లబ్ధిదారులకు రూ.830.25 కోట్ల ఆస్తులను పంపిణీ చేశారు. విధినిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన 329 మంది అధికారులు, ఉద్యోగులకు మంత్రి ప్రశంసా పత్రాలు అందజేశారు.



అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కడప అంధుల పాఠశాల 9వ తరగతి విద్యార్థి మహమ్మద్ సల్మాన్ కీబోర్డుపై సారే జహాసే అచ్చా గీతాన్ని వినిపించి అలరించారు. కడప జయనగర్ కాలనీ జెడ్పీ హైస్కూలు విద్యార్థులు ఆపరేషన్ సిందూర్, యోగాంధ్రపై నిర్వహించిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. పులివెందుల బీసీ వెల్ఫేర్ స్కూలు విద్యార్థులు నిర్వహించిన యోగా పిరమిడ్ ప్రదర్శన అలరించింది. వల్లూరు, కస్తూర్బా గురుకుల విద్యార్థులు దేశ్ కే దడ్ఖన్ థీమ్‌తో నిర్వహించిన నృత్య ప్రదర్శన అలరించింది. పెహల్గాం దాడి–ఆపరేషన్ సిందూర్ థీమ్‌తో కడప హ్యాపీ కిడ్స్ విద్యార్థులు ప్రదర్శించిన నృత్య రూపకం స్ఫూర్తి నింపింది.



జయహో భారత్..

కడప ముద్ర డ్యాన్స్ అకాడమి విద్యార్థులు నిర్వహించిన భారతామృత నృత్య రూపకం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

సమరయోధుల కుటుంబాలకు సన్మానం



స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబాలను సత్కరిస్తున్న మంత్రి ఫరూఖ్

జిల్లాకు చెందిన సమరయోధుల కుటుంబ సభ్యులను మంత్రి ఫరూఖ్, కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ అశోక్‌కుమార్, జేసీ అదితిసింగ్ ఘనంగా సత్కరించారు. పెదబల్లె బాలయల్లారెడ్డి కోడలు అరుణాదేవి, బుద్ధారెడ్డి శేషన్న కోడలు రమాదేవి, వేల్పుల సుబ్బయ్య సతీమణి నారాయణమ్మ, అశ్వర్థరెడ్డి కుమారుడు చంద్రశేఖర్‌రెడ్డి, సింగం శివారెడ్డి కుమారుడు సింగం జగన్‌మోహన్‌రెడ్డి, బాలిరెడ్డి కుమారుడు శివశంకర్‌రెడ్డి, పిల్లా వెంకట్రామిరెడ్డి కోడలు కమలమ్మ, వల్లపు వెంకట సుబ్బయ్య కుమారుడు రఘురామిమూర్తి, పక్కీరప్ప కుమారుడు శరత్‌బాబును సత్కరించారు.

ఆకట్టుకున్న డాగ్ షో



పోలీసు డాగ్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. క్లూస్ టీమ్‌లో కీలక పాత్ర పోషించే డాగ్స్ తమ విన్యాసాలతో ఆహూతులను ఆకట్టుకున్నాయి.



అగ్నిమాపక శాఖ సిబ్బంది విన్యాసం



విద్యార్థినుల భరతనాట్యం



వేడుకలు తిలకిస్తున్న వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, ప్రజలు

గోవిందమాంబకు సారె సమర్పణ



సారె తీసుకుని వస్తున్న గాలి కరుణాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు, రమాదేవి

బ్రహ్మంగారిమఠం: బ్రహ్మంగారిమఠంలో శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ధర్మపత్ని గోవిందమాంబకు శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం చీర, సారె, పసుపు, కుంకుమలను సమర్పించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ బ్రహ్మిణి సేవాసమితి కడప నిర్వాహకురాలు అంకిరెడ్డిపల్లె రమాదేవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కర్ణాటక మాజీ మంత్రి గాలి కరుణాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. తోట్లపల్లె అచలానంద ఆశ్రమం పీఠాధిపతి శ్రీ విరజానందస్వామి, నొస్సం వీరభద్రస్వామి పాల్గొన్నారు. మహిళా భక్తులు మఠం పురవీధులలో చేపట్టిన కోలాటం ఆకట్టుకుంది. భక్తులకు అన్న ప్రసాదం అందించారు. కార్యక్రమంలో ఎస్సార్ శ్రీనివాసులరెడ్డి, నారాయణరెడ్డి, ఈవీ రమణారెడ్డి, శేగినేని పోతులూరయ్య తదితరులు పాల్గొన్నారు.



కోలాటం చేస్తున్న భక్తులు

కృష్ణం వందే జగద్గురుం





విద్యుద్దీపాలంకరణలో శ్రీకృష్ణాలయం, విశేష అలంకారంలో శ్రీకృష్ణుని మూల విరాట్

నేడు శ్రీ కృష్ణ జన్మాష్టమి

కడప కల్చరల్: శ్రీకృష్ణుడు.. ధీరోదాత్తత, రాజకీయ చతురత, ధర్మకర్తవ్య నిరతికి ప్రతిరూపం. ఇంతటి విభిన్నమైన జీవన గమనం గల పాత్ర ఇతిహాసాలలో మరేది కనిపించదంటారు పెద్దలు. అష్టమినాడు కష్టాల మధ్య కటకటాల్లో జన్మించి, రేపల్లె అనే చిన్న గ్రామంలో పెరిగి మహాయుద్ధం కురుక్షేత్రంలో ప్రధానపాత్ర వహించిన శ్రీకష్ణుని జన్మదినం శనివారం ఘనంగా నిర్వహించనున్నారు.

గోవుకు పూజార్హత: రాచబిడ్డడైన శ్రీకష్ణుడు గోకులం చేరి గోపాలకుడయ్యాడు. అక్కడి గోపాలురకు ప్రియ మిత్రుడయ్యాడు. ప్రకృతి ఒడిలో లీనమై గోవులకు పూజార్హత కల్పించాడు. కృష్ణుడు అష్టమినాడు గోకులంలో జన్మించాడు గనుకే ఆయన జన్మదినాన్ని గోకులాష్టమిగా పేర్కొంటారు. ప్రభుత్వం, పలు స్వచ్ఛంద సంస్థలు కూడా గోశాలలు ఏర్పాటు చేస్తున్నాయి. జిల్లా అంతటా దాదాపు 100 గోశాలలు ఉండగా, కేవలం కడప నగర శివార్లలోనే ఐదు గోశాలలు ఉండటం విశేషం. జిల్లాలో ప్రత్యేకించి శ్రీకష్ణునికి ఆలయాలు తక్కువేనని చెప్పవచ్చు. కడప నగరం ద్వారకానగర్‌లోని శ్రీ మురళీకృష్ణాలయం, శ్రీ రుక్మిణీ పాండురంగస్వామి దేవస్థానం, రాయచోటి రోడ్డులోని శ్రీకృష్ణాలయంతోపాటు జమ్మలమడుగు వద్ద రథం రూపంలో గల భారీ శ్రీకృష్ణాలయం, రాయచోటి మోటకట్ల వద్ద కృష్ణాలయం ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి.

కృష్ణుని సేవలో.. కడప కవులు..

శ్రీకృష్ణ లీలలను వివరించే మహాభాగవతాన్ని పోతన మన జిల్లాలోని ఒంటిమిట్ట దివ్య క్షేత్రంలో రచించారు. ఇంకా ప్రముఖ ఇంజినీరు పుత్తా పుల్లారెడ్డి భాగవత నామ సర్వస్వం పేరిట అందులోని 4124 పేర్లు, వాటి వివరాలతో 450 పేజీల పుస్తకాన్ని వెలువరించారు. పద్మశ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు భాగవత సుధాలహరి, జనమంచి శేషాద్రిశర్మ, శ్రీకృష్ణవతార తత్వం, వావిలికొలను సుబ్బారావు, శ్రీకష్ణా లీలా తరంగిణి, మైనంపాటి సుబ్రమణ్యం, శ్రీకృష్ణ తాండవం రచించారు. జిల్లాకు చెందిన ఆధ్యాత్మికవేత్త అచ్చోలు పుల్లారెడ్డి భగవద్గీతను విశేషంగా ప్రచారం చేశారు.

ఆలయాలు ముస్తాబు

ఏటా కృష్ణాష్టమిని జిల్లాలో ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ముఖ్యంగా కృష్ణాలయాలను అందంగా ముస్తాబు చేశారు. నగర వాసులు పెద్ద సంఖ్యలో సమీపంలోని శ్రీకృష్ణుని దేవాలయాలకు కుటుంబాలతో సహా తరలి వస్తారు. ప్రభుత్వం పాఠశాలలకు సెలవు ప్రకటించడంతో బాలలు సైతం స్వామిని దర్శించుకుంటారు. పలు పాఠశాలల్లో తమ విద్యార్థులతో శ్రీకృష్ణునిపై చిన్నస్కిట్‌లు ప్రదర్శింపజేస్తారు. మరి కొన్ని చోట్ల చిన్నారి బాలలకు శ్రీకృష్ణుడు, గోపెమ్మలుగా అలంకారం చేసి తల్లిదండ్రులు ఆనందిస్తారు. ముఖ్యంగా బాలలు, యవత కోసం ఉత్సవాల్లో భాగంగా ఆలయాల వద్ద సాయంత్రం ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహ భరితంగా నిర్వహిస్తారు.

వేడుకున్నా ఓటు వేయనివ్వలేదు.. ఇదో ఎన్నికా?

- ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

రాజంపేట రూరల్: పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణలో కూటమి ప్రభుత్వం నాయకులు ఎన్నికల నియమావళిని అభాసుపాలు చేశారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి ధ్వజమెత్తారు. స్థానిక ఆకేపాటి భవన్‌లో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఆకేపాటి శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశ చరిత్రలో ఇటువంటి ఎన్నిక ఎక్కడా నిర్వహించలేదని మండిపడ్డారు. ఎన్నికల సంఘం, పోలీసు శాఖ పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడంలో విఫలమయ్యాయన్నారు. అభ్యర్థి కూడా ఓటు వేసుకోకపోవడం ఇప్పటి వరకు ఎక్కడా జరగలేదన్నారు. ఏజెంట్‌లను బూత్‌లలోకి రానివ్వకుండా జరిగిన ఏకైక ఎన్నికలు ఇవేనన్నారు. ఇతర నియోజకవర్గం నుంచి మనుషులు వచ్చి బూత్‌లు ఉన్న గ్రామాలలో షామియానాలు వేసుకొని జాతరను తలపించేలా చేస్తూ.. ఓటర్లను ఓటు వేసేందుకు పోనివ్వకుండా అడ్డుపడ్డారంటే వారికి పోలీసులు ఎంత సహకరించారో ఇట్టే అర్థం అవుతుందన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



ప్రమాదంలో మరణించిన ఫయాజ్

జమ్మలమడుగు : ఎర్రగుంట్ల మండలంలోని పోట్లదుర్తి గ్రామం నుంచి బుల్లెట్‌పై ప్రొద్దుటూరుకు వెళ్తున్న ఫయాజ్(25) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శుక్రవారం సాయంత్రం పని నిమిత్తం ఫయాజ్ ప్రొద్దుటూరుకు వెళుతుండగా మణిపూర్‌కు చెందిన గీతా సర్కస్‌కు చెందిన ముగ్గురు స్నేహితులు స్కూటర్‌లో ఎదురుగా వస్తుండటంతో ఆదుపు చేయలేక బుల్లెట్ టీవీఎస్‌లు ఢీకొన్నాయి. ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఫయాజ్ పోలీసులు తెలిపారు. గీతా సర్కస్‌కు చెందిన వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి.

గుర్తు తెలియని వ్యక్తి..



ప్రొద్దుటూరు క్రైం : స్థానిక టీబీ కాంప్లెక్స్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు సమాచారం అందిండంతో శుక్రవారం త్రీ టౌన్ సీఐ గోవిందరెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. ఎరుపు రంగు చొక్కా ధరించిన మృతుడికి సుమారు 50 ఏళ్ల లోపు ఉంటాయని సీఐ తెలిపారు. అతను అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వ్యక్తులు త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ కోరారు.

డంపింగ్‌యార్డు వద్ద..

– మరొకరికి గాయాలు



మృతి చెందిన సమీర్

చింతకొమ్మదిన్నె : కడప–చిత్తూరు జాతీయ రహదారిపై మద్దిమడుగు సమీపంలోని డంపింగ్ యార్డ్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో షేక్ సమీర్ అనే వ్యక్తి మృతి చెందినట్లు చింతకొమ్మదిన్నె పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు గువ్వల చెరువుకు చెందిన సమీర్ మరొకరితో కలిసి బైక్ పైన కడప వైపుకు వస్తుండగా కడప నుండి డంపింగ్ యార్డ్‌కు వెళ్తున్న చెత్త సేకరణ వాహనం డంపింగ్ యార్డ్ సమీపంలో రహదారిపై ఢీకొనడంతో షేక్ సమీర్ మృతి చెందినట్లు, మరొకరు గాయపడినట్లు తెలిపారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కోనేరులో ఈతకు వెళ్లిన వ్యక్తి గల్లంతు



వ్యక్తి ఆచూకీ కోసం గాలిస్తున్న పోలీసులు

అట్లూరు : లంకమల అభయారణ్యంలో వెలసిన రామలింగేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో ఉన్న కోనేరులో సరదా కోసం ఈతకు వెళ్లిన వ్యక్తి గల్లంతైనట్లు స్థానిక ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. వివరాలిలా.. మైదుకూరుకు చెందిన నలుగురు వ్యక్తులు శుక్రవారం రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న కోనేరులోకి నలుగురు వ్యక్తులు ఈతకు దిగారని, వారిలో ముగ్గురు బయటికి రాగా నాల్గవ వ్యక్తి హబీబుల్లా (36) గల్లంతయ్యాడు. ఈ మేరకు సమాచారం అందడంతో బద్వేలులోని అగ్నిమాపక సిబ్బందిని తీసుకెళ్లి రాత్రి పొద్దుపోయే వరకు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. అక్కడ విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో పాటు వర్షం కురుస్తుండటంతో గాలింపు చర్యలకు ఇబ్బందికరం కావడంతో వెనుతిరిగినట్లు పోలీసులు తెలిపారు. తిరిగి శనివారం గాలింపు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఎస్ఐతో పాటు స్టేషన్ రైటర్ నాగేశ్వర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శకటాల ప్రదర్శన



ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం



కలెక్టర్ బంగాళాలో అట్‌హోంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు

కడప సెవెన్‌రోడ్స్ : కడప పోలీసు పరేడ్ మైదానంలో శుక్రవారం 79వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు కనుల పండువగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రభుత్వ శాఖలు తాము చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను శకటాల ద్వారా ప్రదర్శించి సంబంధిత వివరాలను ప్రజలకు తెలియజేశారు. డీఆర్‌డీఏ, పరిశ్రమలు, పర్యాటక, దేవదాయ, విద్యాశాఖలు, సమగ్ర శిక్ష, ఐసీడీఎస్, వైద్య ఆరోగ్యం, అటవీ, వ్యవసాయ, పశు సంవర్ధక, పంచాయతీరాజ్, విద్యుత్, ఉద్యాన, నగర పాలక సంస్థ, జిల్లా విపత్తు స్పందన (అగ్నిమాపక), పోలీసు శాఖలు శకటాలు ప్రదర్శించాయి. వీటిలో టూరిజం శకటానికి మొదటి బహుమతి, కేఎంసీ శకటానికి ద్వితీయ బహుమతి, ఐసీడీఎస్ శకటానికి తృతీయ, డీఆర్‌డీఏ శకటానికి నాల్గవ బహుమతి లభించింది.

ఘనంగా అట్‌హోం కార్యక్రమం

79వ భారత స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని స్థానిక జిల్లా కలెక్టర్ బంగ్లా ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణంలో... కన్నుల పండువగా ప్రారంభమైన 'అట్ హోమ్' కార్యక్రమం జరిగింది. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఏర్పాటు చేసిన ఈ తేనీటి విందులో కమలాపురం, జమ్మలమడుగు, మైదుకూరు ఎమ్మెల్యేలు కృష్ణ చైతన్య రెడ్డి, చడిపిరాళ్ల ఆదినారాయణ రెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్, జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, కడప నగర పాలక కమీషనర్ మనోజ్ రెడ్డి, కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీఓలు పాల్గొనగా వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. అట్ హోమ్ కార్యక్రమంలో జిల్లా టూరిజం శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి.



స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి ఫరూఖ్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్న జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు



అడిషనల్ ఎస్పీ కె.ప్రకాశ్‌బాబు | బి.రమణయ్య, అడిషనల్ ఎస్పీ | ఆర్డీఓ జాన్ ఇర్విన్, కడప | జమ్మలమడుగు ఆర్డీఓ ఆదిమూలం సాయిశ్రీ



ఎ.చంద్రమోహన్ ఆర్డీఓ, బద్వేలు | వెంకటపతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ | మనోజ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, కడప | కిరణ్‌కుమార్, మెప్మా పీడీ



రంగస్వామి, రిమ్స్ అడ్మినిస్ట్రేటర్ | ఓబులమ్మ, జెడ్పీ సీఈఓ | నాగరాజు, డీఎంహెచ్ఓ | పెంచలయ్య, జీజీహెచ్ సూపరింటెండెంట్ | మురళీకృష్ణ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డు | షంషుద్దీన్, డీఈఓ | ధర్మారావు, అగ్నిమాపకశాఖ అధికారి | విజయ్‌కుమార్, ఆగ్రోస్ జిల్లామేనేజర్ | సురేష్‌కుమార్, జిల్లా ఉపాధిఅధికారి | రాజ్యలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ | ఆదిశేషారెడ్డి, డ్వామా పీడీ | సరస్వతి, సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్



హజరతయ్య, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ | జగన్నాథం, లీడ్ బ్యాంకు మేనేజర్ | సుధాకర్, డీఎస్పీ | వెంకటేశ్వర్లు, డీఎస్పీ, కడప | మురళీనాయక్, డీఎస్పీ, పులివెందుల | భావన, డీఎస్పీ, ప్రొద్దుటూరు | రాజేంద్రప్రసాద్, డీఎస్పీ, మైదుకూరు | వెంకటేశ్వరరావు, జమ్మలమడుగు, డీఎస్పీ | బాలస్వామిరెడ్డి, డీఎస్పీ, మహిళా పీఎస్ | అబ్దుల్ కరీం, డీఎస్పీ, డీటీసీ | ప్రతాప్‌రెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ | సుబ్బారెడ్డి, వయోజన విద్య శాఖ అధికారి



ఎ.పుష్పరాజు, బీసీ వెల్ఫేర్ | తస్నియా, మోరగుడి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ | మరియకుమారి, డిప్యూటీ హెచ్ఈఓ | ప్రసాద్, పీహెచ్‌సీ ఎంపీ హెచ్ఈఓ, చక్రాయపేట | ఎస్.ఖాజామొహిద్దీన్, వైద్యాధికారి | అరుణకుమారి, పీహెచ్‌సీ ఎంపీహెచ్ఏ, కలసపాడు | శివరామిరెడ్డి, ఫైర్ స్టేషన్ అధికారి, వేంపల్లె | పవన్‌కుమార్, అగ్నిమాపకశాఖ లీడింగ్‌ఫైర్‌మెన్, కడప | చిన్నయ్య, అగ్నిమాపక శాఖ సిబ్బంది, బద్వేలు | ఓబులేశు, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ | కృష్ణయ్య, ఫారెస్టు రేంజ్ ఆఫీసర్, పోరుమామిళ్ల | కృష్ణప్రసాద్, ఫారెస్టు బీట్ ఆఫీసర్, కడప



వెంకట్రామయ్య, ఫారెస్టు బీట్ ఆఫీసర్, వనిపెంట | లిల్లి సునీత, రిమ్స్ డిప్యూటీ సీఎస్ ఆర్ఎంఓ | టీఎం రేఖారావు, రిమ్స్ అసోసియేట్ ప్రొఫెసర్ | సునీల్‌కుమార్‌రెడ్డి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రొఫెసర్ | వై.శేఖర్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అసిస్టెంట్ డైరెక్టర్ | మాలతి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ | వి.సూకరాజు, రిమ్స్ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ | అశోక్, సంఘ సేవకుడు | భాస్కర్, ఎయిడ్స్ నియంత్రణ అధికారి వేంపల్లె | శివశంకర్ నాయక్, సీఐ, సీకే దిన్నె | జి.ఓబులేశు, సీఐ, చిన్నచౌకు | టి.బాబు, సీఐ, ఒంటిమిట్ట



శివశంకర్, సీఐ, మైదుకూరు రూరల్ | వినయ్‌కుమార్‌రెడ్డి, డీటీసీ కోర్టు ఇన్‌స్పెక్టర్ | భాస్కర్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ | రామకృష్ణారెడ్డి, సీఐ ప్రొద్దుటూరు వన్‌టౌన్ | వెంకట రమణ, సీఐ, కమ్యూనికేషన్ | ఈశ్వర్‌రెడ్డి, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ | శంకర్‌రెడ్డి, ఆర్ఎస్ఐ ఎస్‌టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ | శ్రీనివాసులురెడ్డి, ఎస్ఐ, సీకే దిన్నె | జీవన్‌రెడ్డి, పీసీఆర్ ఎస్ఐ, కడప | సుబ్బరాజు, చిన్నచౌకు ఏఎస్ఐ | రాంభూపాల్‌రెడ్డి, ఏఎస్ఐ, బద్వేలు | జైనుల్లా, ఎస్పీ సీసీ

మద్యం అమ్మకాలను ప్రోత్సహించడం దుర్మార్గమైన చర్య

మహిళా సంఘాల నిరసన



నిరసన తెలుపుతున్న మహిళా సంఘాల ప్రతినిధులు

ప్రొద్దుటూరు క్రైం : ప్రభుత్వమే మద్యం అమ్మకాలను ప్రోత్సహించడం దుర్మార్గమైన చర్య అని మహిళా సంఘాల ఐక్యవేదిక సభ్యులు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పట్టణంలోని గాంధీరోడ్డులోని గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం మహిళా సంఘాల ఐక్యవేదిక సభ్యులు నిరసన తెలిపారు. సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఉచిత బస్సులు కావాలని అడగలేదన్నారు. నిజమైన స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, కనీస రక్షణ, జీవించే హక్కు కోసం ప్రభుత్వం తగిన జీవన విధానాలను తీసుకురావాలని తెలిపారు. ఉచిత పథకాలతో మహిళల్ని కేవలం ఓటు బ్యాంకుగా చూస్తున్న ప్రభుత్వం, మరో వైపు కొత్త మద్యం పాలసీని తీసుకొచ్చి సమాజంలో మరింతగా అరాచకం పెరిగేలా చేస్తున్నారని విమర్శించారు. బార్లను అర్ధరాత్రి వరకు నడపడానికి అనుమతిస్తూ, మద్యం షాపుల్లో పర్మిట్ రూంలను పెట్టుకునేలా ఆదేశాలు ఇవ్వడం హేయమని చర్య అని అన్నారు. దీని వల్ల మహిళలకు, యువతులకు భద్రత లేకుండా పోతుందని చెప్పారు. రాత్రి 10 దాటిన తర్వాత పోలీసులు సైతం దగ్గరుండి నిత్యావసర, ఇతర వ్యాపార సంస్థలను మూసేస్తున్నారని, అయితే బార్లకు మాత్రం అర్ధరాత్రి వరకు నిర్వాహించాల్సిన అవసరం ప్రభుత్వానికి ఏమొచ్చిందని విమర్శించారు. ప్రొద్దుటూరు విద్యార్థిని గండికోటలో హత్యకు గురైతే ఇంత వరకు పోలీసులు నేరస్తులను పట్టుకోలేదన్నారు. కొత్త మద్యం పాలసీని తక్షణమై రద్దు చేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో మహిళాశక్తి కన్వీనర్ లక్ష్మీదేవి, న్యాయవాది హరిత, చైతన్య మహిళా సంఘం కన్వీనర్ పద్మ, జమాతే ఇస్లామీ మహిళా విభాగం కన్వీనర్ రెహానా, ప్రగతిశీల కార్మిక సమాఖ్య కన్వీనర్ నాగేంద్ర, విరసం వరలక్ష్మి పాల్గొన్నారు.

ఘాట్ రూట్లలో ఉచిత ప్రయాణానికి అనుమతులు

సాక్షి ఎఫెక్ట్..

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి శుక్రవారం 'ఘాట్ రూట్లలో ఉచిత ప్రయాణానికి నో' శీర్షికన వార్తను ప్రచురించింది. ఈ వార్తకు స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని సవరించుకుంటూ ఉత్తర్వులు జారీ చేసింది. ఘాట్ రూటులో ప్రయాణించే బస్సులో నిలబడి ప్రయాణించకుండా బస్సు కెపాసిటీ మేరకు ప్రయాణికులను ఎక్కించుకోవాలని సూచించారు. ప్రయాణికుల భద్రతను నిర్ధారించేందుకు అవసరమైన అన్నిజాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే సప్తగిరి ఎక్స్‌ప్రెస్, గ్రీన్ సప్తగిరి బస్సులకు స్త్రీ శక్తి పథకం వర్తించదని సూచించారు.

దేశ ప్రగతి కోసం పాటుపడదాం

– వైవీయూ కులసచివులు ఆచార్య పి.పద్మ



మాట్లాడుతున్న వైవీయూ రిజిస్ట్రార్ పుత్తాపద్మ

కడప ఎడ్యుకేషన్ : భారతావని సాధించిన విజయాలను స్ఫూర్తిగా తీసుకుని దేశ పురోగతికి విశ్వవిద్యాలయాల ఆలోచనలు, ఆవిష్కరణలు దోహదమయ్యేలా విద్యార్థులు పరిశోధకుల కృషి జరగాలని కులసచివులు ఆచార్య పి.పద్మ ఆకాంక్షించారు. శుక్రవారం యోగి వేమన విశ్వవిద్యాలయం పరిపాలన భవనం వద్ద స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కులసచివులు పి.పద్మ జాతీయ పతాకాన్ని ఎగురవేసి సెల్యూట్ చేశారు. ఆమెతో పాటు యూనివర్సిటీ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్స్ శాఖ సంచాలకులు డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆచార్య పుత్తా పద్మ విశ్వవిద్యాలయ ఉపకులపతి పంపిన సందేశాన్ని వినిపించారు. అధ్యాపకులుగా వృత్తిపట్ల అంకితభావంతో ఉంటూ విలువలను, జ్ఞానాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, రీసెర్చ్ స్కాలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఉపయోగకరం

- రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్
- జిల్లాలో ఘనంగా ప్రారంభమైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం



ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వం స్వాతంత్ర్య దినోత్సవం రోజున అమలు చేస్తున్న 'స్త్రీ శక్తి పథకం' మహిళలకు ఉపయోగకరమని, ఈ పథకం వారికి రెట్టింపు స్వేచ్ఛను ఇస్తుందని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూఖ్ అభివర్ణించారు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'స్త్రీ శక్తి' పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కార్యక్రమాన్ని శుక్రవారం కడప ఆర్టీసీగ్యారేజీలో మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని ఏపీఎస్ ఆర్టీసి కి చెందిన సిటీ, పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలు పూర్తి ఉచితంగా ప్రయాణించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకానికి రూపకల్పన చేయడం జరిగిందన్నారు. పథకంలో భాగంగా మహిళలు 5 రకాల బస్సుల్లో ఉచిత ప్రయాణం చేసే వెసులుబాటును రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందన్నారు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు బస్సులతో పాటు సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ మహిళలు ఉచిత ప్రయాణం చేయవచ్చన్నారు. ప్రభుత్వం జారీ చేసిన ఆధార్, రేషన్ కార్డు, ఓటర్ ఐడీలలో ఏదో ఒకటి చూపించి కండక్టర్ జారీ చేసే జీరో ఫేర్ టికెట్‌తో మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు. కేవలం మహిళలకే కాకుండా మరోవైపు ఉచిత బస్సు ప్రయాణాన్ని ట్రాన్స్‌జెండర్లకు సైతం వర్తింపజేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నదన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం రోజుకు 2.16 వేల కిలోమీటర్ల చొప్పున బస్సులు ప్రయాణికులను వారి గమ్య స్థానాలకు చేర్చడం జరుగుతుందన్నారు. బస్ స్టేషన్ మేనేజర్లు/ కంట్రోలర్స్/ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ప్రయాణికుల పట్ల మర్యాద పూర్వకముగా ప్రవర్తించేలా ఆర్టీసీ యాజమాన్యం ద్వారా ప్రతి ఒక్కరికీ సూచించామన్నారు. ఎమ్మెల్యే మాధవీరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు కల్పించిన ఈ అవకాశం వారి కుటుంబ ఆర్థిక స్వావలం మనకు ఎంతో చేయూతని ఇస్తుందన్నారు.

ఆర్ఎంకు చురకలు :

ఎమ్మెల్యే మాధవీరెడ్డి కడప నగరంలో ఏడాది కింద తాను నగరంలో సిటీ బస్సులను నడపాలని సూచించామని, ఈ విషయంగా పట్టించుకోకపోవడంపై ఆర్ఎం గోపాల్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని అసెంబ్లీతోపాటు సీఎం దృష్టికి తీసుకువెళతామని తెలిపారు. ఇప్పటికైనా కనీసం 4 బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

వివాహాల నమోదుకు పాస్టర్ల నియామకం

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలో క్రిస్టియన్ మతానికి చెందిన వివాహాలను నిర్వహించి అందుకు తగిన వివాహ ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేందుకు ముగ్గురు పాస్టర్లను నియమిస్తూ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. చట్ట పరిధిలో ఆచారాల ప్రకారం మతపరమైన వివాహాలు నిర్వహించడానికి వారికి అధికారం కల్పించారు. నగరంలోని రాజారెడ్డివీధికి చెందిన రెడీమర్ చర్చికి చెందిన పాస్టర్ డాక్టర్ భవనాసి సుధీర్, పులివెందుల నగరిగుట్టకు చెందిన రాక్ ప్రేయర్ హౌస్ చర్చి పాస్టర్ కోట్ల ఇమ్మాన్యుయేల్, సాలేము ప్రేయర్‌హౌస్ చర్చి పాస్టర్‌పాదాల ఏసయ్యను నియమించారు.పై ముగ్గురు పాస్టర్లు చట్టప్రకారం క్రైస్తవ యువతీ యువకులకు వివాహం జరిపించి, వివాహ ధృవీకరణ పత్రాలు జారీచేసే అధికారం కల్పించారు. రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి సి.శ్రీధర్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

20న విచారణకు హాజరవుతా

జమ్మలమడుగు : పోలీసుల విచారణకు ఈనెల 20వతేదీన హాజరవుతారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తన లాయర్ ద్వానా నోటీసులు పంపించారు. ఈనెల 12వతేదీన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని అరెస్టు చేసి ఎర్రగుంట్ల మీదుగా కడపకు తరలిస్తుండటంతో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఎంపీని ఎక్కడకు తరలిస్తున్నారంటూ అడ్డుకున్నారు. ముందస్తు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా అక్రమ అరెస్టు చేయడం ఎమిటంటూ ప్రశ్నించారు. దీంతో పోలీసులు తమ విధులకు ఆటంకం కలిగించారని 189/21 సెక్షన్,191–3,126–2,132(353),351(2) సెక్షన్లు కింద కేసు నమోదు చేశారు. బుధవారం సాయంత్రం నిడిజివ్వి గ్రామానికి సీఐ నరేష్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని విచారణ నిమిత్తం అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం కండీషన్ బెయిల్‌పై విడుదల చేశారు. శనివారం మళ్లీ విచారణకు హాజరు కావాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో సుధీర్‌రెడ్డి అనారోగ్యానికి గురి కావడంతో తాను 16వతేదీన పోలీసుల విచారణకు హాజరు కాలేనని, ఈనెల 20వతేదీన హాజరవుతానంటూ తన తరపున న్యాయవాది ద్వారా నోటీసులను పంపించారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో స్వాతంత్య్ర వేడుకలు



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 79వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాతో కలిసి జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు, త్యాగధనుల త్యాగాల ఫలితంగా భారతదేశానికి స్వాతంత్ర్యం లభించిందన్నారు. వారందరి స్ఫూర్తితో మనం ముందుకు సాగాలని, ఈ స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను ఇలాగే భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తు చేశారు. జాతీయ నాయకుల ఆశయాల మేరకు దేశాభివృద్ధి కోసం మన వంతు కృషి చేయాలని కోరారు.దేశాభివృద్ధి, రాష్ట్రాభివృద్ధిలో వైఎస్సార్‌సీపీ కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాక సురేష్ కుమార్, గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్, జిల్లా నాయకులు పులి సునీల్ కుమార్, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఎస్ఏ కరిముల్లా, ఎస్. వెంకటేశ్వర్లు, సీహెచ్ వినోద్, జాషువా,త్యాగరాజు, దాసరి శివ, వేణుగోపాల్‌నాయక్, మహిళా నేతలు టీపీ వెంకట సుబ్బమ్మ, పత్తిరాజేశ్వరి, బి. మరియ తదితరులు పాల్గొన్నారు.